క్లుప్తంగా

లా-సెట్‌లో మచిలీపట్నం విద్యార్థినికి 15వ ర్యాంకు


శ్రీశ్రేయన

మచిలీపట్నంటౌన్: నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన లా-సెట్‌లో మచిలీపట్నానికి చెందిన మురాల శ్రీశ్రేయన రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సాధించింది. శ్రీశ్రేయన తల్లిదండ్రులు వెంకటేష్, మస్తానమ్మ జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదులుగా పనిచేస్తున్నారు. వారి కుమార్తెను కూడా న్యాయవాదిగా చేసేందుకు పరీక్ష రాయించారు.

సిబ్బంది సమయ పాలన పాటించాలి



పెడన: సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామని ఎంపీడీఓ వి. రెడ్డయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని నందమూరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ సచివాలయాన్ని సందర్శించిన సమయంలో సిబ్బంది అరకొరగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మూమెంట్ రిజిస్టర్‌తో పాటు అటెండెన్సు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయా రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఇలాంటి తప్పులు పునరావృతం అయితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కోడూరు: యర్రారెడ్డివారిపాలెం, నాయుడుపేట, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పాండురంగారావు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధి కూలీల వివరాలు తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఎండ వేడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పని ప్రాంతంలో తప్పనిసరిగా తాగునీటిని ఉంచడంతో పాటు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని కూడా కూలీలకు అందించాలని ఎంపీడీఓ ఆదేశించారు. అనంతరం లింగారెడ్డిపాలెం గ్రామంలో అమృత్ సరోవర్ పథకం ద్వారా తవ్వుతున్న చెరువును పరిశీలించి సూచనలు చేశారు. ఏపీఓ రాజ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

63 మందికి వైద్య పరీక్షలు



భావదేవరపల్లి(నాగాయలంక): ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్, 104 సంచార వైద్య శిబిరం భావదేవరపల్లి గ్రామంలో శనివారం నిర్వహించారు. 63 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. నాగాయలంక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. 104 బందరు డివిజన్ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్లు సంచార వైద్య శిబిరాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్.శివయ్య, హెల్త్ సూపర్‌వైజర్ అర్జా సుబ్రహ్మణ్యం, హెచ్‌వీ ఎల్.రత్నకుమారి, 104 మండల డీఈఓ దేవరకొండ గంగాభవాని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్ తీరు హాస్యాస్పదం

వైఎస్సార్ సీపీ మండల నేతల ధ్వజం

కోడూరు: నాలుగేళ్ల నుంచి నియోజకవర్గంలో కనిపించని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రస్తుతం సమస్యల పేరుతో పోరాటలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల మండల అధ్యక్షుడు పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు కట్టిస్తుంటే టీడీపీ నేతలు చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. జగనన్న కాలనీల్లో మట్టి మెరక పనులు చేయకుండా బుద్ధప్రసాద్ నానా రాద్ధాంతం చేస్తున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావుపై కావాలనే విమర్శలు చేస్తున్నారని, వీటిల్లో ఏ మాత్రం వాస్తవం లేదని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ అన్నారు. బుద్ధప్రసాద్ తాను చేస్తున్న ఆరోపణలపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పచ్చతోరణంలో భాగస్వాములు కావాలి

ఎన్‌హెచ్-216 వెంబడి మొక్కలు నాటిన ఎమ్మెల్యే సింహాద్రి


మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

చల్లపల్లి: విస్తృతంగా మొక్కలు నాటి వాటిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గ్రామంలో వైద్య దంపతులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్-డాక్టర్ తరిగోపుల పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం 2,800 రోజుకు చేరుకున్న సందర్భంగా జగనన్న పచ్చతోరణం పురస్కరించుకుని స్థానిక గంగులవారిపాలెం వద్ద జాతీయ రహదారి-216కి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రమేష్‌బాబు శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2,800 రోజులుగా గ్రామ పరిశుభ్రత, అభివృద్ధి, సుందరీకరణకు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం భారతదేశంలో ప్రారంభించినప్పుడు అనేక గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించినప్పటికీ, ఇప్పటికీ కొనసాగుతున్న ఏకైక గ్రామం దేశం మొత్తం మీద చల్లపల్లి మాత్రమే అని చెప్పారు. అయితే స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తల శ్రమదానం, అభివృద్ధి కార్యక్రమాలు ఇవే కాకుండా ప్రతి బజారులో నివాసితులే తమ బజారును పరిశుభ్రంగా నిర్వహించుకునేలా చైతన్యపరిచినప్పుడే స్వచ్ఛ సుందర చల్లపల్లి లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి, ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, స్వచ్ఛ సైనికులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వరమే కేసులు పరిష్కారం పొందే అవకాశం ఉందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జూలై 22న భూ సేకరణ, ఇన్సూరెన్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌కు సిఫార్సు చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ అంశంలో ఇబ్బందులపై కక్షిదారులు పలు కేసులు దాఖలు చేశారని, ఈ కేసుల్లో రాజీ మార్గంగా అధికారులు, కక్షిదారులతో మాట్లాడి పరిష్కారం పొందే విధంగా చూడాలన్నారు. మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌లకు సంబంధించి దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి కేసులను లోక్ అదాలత్‌కు సిఫార్సు చేసుకుని పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి సూచించారు. న్యాయమూర్తులు ఎస్.రామకృష్ణ, చినబాబు, ఎ.నరసింహమూర్తి, కేవీ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయమూర్తి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక నోబుల్ కళాశాలలో న్యాయ సేవా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైన అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు ధైర్యంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. ర్యాగింగ్ చట్ట రీత్యా నేరమని, తోటి విద్యార్థులను ఇబ్బందులు పెట్టకుండా స్నేహపూర్వక వాతావరణ కల్పించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే ఎర్నెస్ట్, న్యాయవాది చీలి ముసలయ్య, ఎస్ఐ రామశాస్త్రి, షాలిని, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు సత్కారం


నాగాయలంకలో బహుమతులు పొందిన విద్యార్థులతో బుచ్చిబాబు


కప్పలదొడ్డి హైస్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు


సత్కరిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఎం.వైష్ణవి, బి.లక్ష్మీ, ఎం.వాగ్దేవిలకు రూ.3 వేలు, రూ.2 వేలు, వెయ్యి చొప్పున నగదు, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను దుశ్శాలువాలతో సత్కరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ వనమా రామకృష్ణ, ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

మండల స్థాయి పురస్కారాలు అందజేత..

కోడూరు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జగనన్న అణిముత్యాల్లో భాగంగా శనివారం మండల స్థాయి పురస్కారాలను అందించారు. కోడూరులోని స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల వద్ద హెచ్‌ఎం ఆలా వెంకటరమణ అధ్యక్షతన ప్రత్యేక సభ నిర్వహించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జరుగు జగదీష్, ఆళ్లమూడి సరయు, వీర్ల ధనశేఖర్, మనస్వినిలకు ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతులను అందించారు.

చిన్నారుల చదువుల బాధ్యత తీసుకున్న జగన్

గూడూరు: చిన్నారులను చదివించే బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు అన్నారు. గూడూరు మండలం కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలలో మండలంలో ప్రథమ స్థానం సాధించిన పి.పూర్ణిమ, ద్వితీయ స్థానం సాధించిన వై.సూర్యవర్ధన్, తృతీయ స్థానం సాధించిన బి.మహేశ్వరిలతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేకున్నా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్న తపన ప్రతి తల్లిదండ్రుల్లో ఉంటుందన్నారు. ఆ భయం లేకుండా జగనన్న పలు పథకాలు అమలు చేస్తూ మీ చిన్నారుల బంగారు భవిష్యత్‌కు అండగా నిలుస్తున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిన ముఖ్యమంత్రిగా దేశంలోనే గుర్తింపు పొందారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, సర్పంచి యక్కల మాధవి, నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల వెంకట కృష్ణారావు, యక్కల నాగరాజు, పేరిశెట్టి మధు, హెచ్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు. వీరిలో ఇద్దరు తృతీయస్థానం సాధించారు. విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జెడ్పీటీసీ అన్నారు. ఎంఈఓ టీవీఎం రామదాసు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, విద్యా కమిటీ చైర్మన్ గల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం..

మంగళాపురం(చల్లపల్లి): ప్రభుత్వం పేదల విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి టాపర్లను సన్మానించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందచేసి సత్కరించారు. సర్పంచ్ నాగేశ్వరరావు ముగ్గురికి తనవంతుగా రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే


ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది

కోడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కోడూరు పంచాయతీ పరిధిలోని దింటిమెరక అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీలో చేర్పించాలని నినాదాలు చేశారు. అనంతరం జనభాగీదారి, గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందించారు. చిన్నారులకు సృజనాత్మకతతో కూడిన విద్యా బోధన చేస్తున్నామని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. సీహెచ్‌ఓ పద్మజ, ఏఎన్‌ఎంలు సునీత, టీచర్లు సుజిత, కుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేర్ని నానిని కలిసిన డీపీటీఓ వాణిశ్రీ


ఎమ్మెల్యే పేర్ని నానికి బొకే అందజేస్తున్న వాణిశ్రీ

మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రజా రవాణాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎ. వాణిశ్రీ శనివారం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)ని మర్యాద పూర్వకంగా కలిశారు. పేర్ని నానికి ఆమె పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్ని నాని ఆమెకు సూచించారు.

బాపులపాడులో అభివృద్ధి పనుల పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మువ్వా తిరుమల కృష్ణబాబు స్వగ్రామమైన బాపులపాడు మండలం తిప్పనగుంటలో శనివారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. రూ.80 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికలను కృష్ణబాబు పరిశీలించారు. తుదిదశకు పనులు చేరుకోవటంతో అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. శ్మశానవాటికల్లో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో రూ. 17.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం, రూ. 21.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌ను కృష్ణబాబు ఆదేశించారు. తొలుత ఆయన అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ సమస్యలపై పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరి ప్రభుకాంత్, సర్పంచ్ కలపాల భీమయ్య, ఇతర గ్రామ ప్రముఖులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అయిన కృష్ణబాబును వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రజల్లో లభిస్తున్న స్పందన గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలని చెప్పారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అధ్యక్షతన శనివారం గ్రామ సభ నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్ హరిబాబు నాయక్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను జరిగిన వివిధ అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. అనంతరం అభివృద్ధి పనుల వివరాలు చదివి వినిపించారు. ఈ నెల 20 తేదీ మండల స్థాయిలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఉప సర్పంచ్ ముమ్మనేని బాబూరావు, జిల్లా రిసోర్స్‌పర్సన్ పి. రమేష్, ఏపీఓ మజ్ను, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు, ఎఫ్ఏ ధనలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రకటన

ఐందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ మచిలీపట్నం బ్రాంచి వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలులో చూపిన [illegible] (లేటు) గారి కుమారుడు [illegible] ఆనంద కుమార్ గారి స్థిరాస్తిని [illegible] చేసుకుని [illegible] గారికి [illegible] ఇచ్చుటకు నిర్ణయించు కున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైనను ఎటువంటి అభ్యంతరాలు గాని, ఐన్లులు, రాళ్లీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోపు ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్ : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్‌రిజిస్ట్రార్ వారి ఐలాకా, మచిలీపట్నం మండలం, మంగినపూడి గ్రామంలో గల మంగినపూడి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన దస్తావేజు నెం. 10036/2015వ లో ఆర్.యస్. నెం. 108/4లో డోర్ నెం. 1/54వ సమీపమున గల య. 0-07 ట్లు లేక 338.8 చ.గ॥ స్థిరాస్తి ఖాళీ నివేశ స్థలమునకు హద్దులు. తూర్పు : సి.డి.ఐ. షెడ్యూలులో మనం వదులుకున్న జాయింటుదారి, దక్షిణం : సి-షెడ్యూలు ఆస్తి, పడమర: పి.వి. శ్రీను స్థలం, ఉత్తరం: ఐ-షెడ్యూలు ఆస్తి.

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం

ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించండి

మున్సిపల్ కమిషనర్ మహేంద్ర


ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న కమిషనర్ మహేంద్ర, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు

పెడన: జగనన్న కాలనీల్లో ఇళ్లను త్వరితగతిన నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర అన్నారు. శనివారం ఆయన తన చాంబర్‌లో గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాస్, పట్టణ ఏఈ రామచంద్రరావులతో కలిసి వార్డు ఎమినిటీ కార్యదర్శులతో జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. పైడమ్మ లే అవుట్‌తో పాటు పల్లోటి -1, 2లలో ఇళ్ల పరిస్థితిపై కమిషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులు డ్వాక్రా రుణాలు తీసుకుని ఇళ్లను నిర్మించుకునేలా చూడాలని మెప్మా సిబ్బందికి సూచించారు. వేసవి ఎండలతో తాపీ పనివారు రావడం లేదని, వాతావరణం చల్లబడగానే పనులు ముమ్మరం చేస్తామని లబ్ధిదారులు పేర్కొంటున్నట్లు కమిషనర్ దృష్టికి ఎమినిటీస్ తీసుకువచ్చారు. అసలు ప్రారంభించని వారితో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు.

ఆకులమన్నాడు సొసైటీ నూరు శాతం రుణ వసూళ్లు


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పకీరు

గూడూరు: 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఆకులమన్నాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూరుశాతం రుణ వసూలు సాధించిందని సంఘం అధ్యక్షుడు జంపాన వెంకట పకీరు తెలిపారు. సొసైటీలో 860 మంది రైతులు తీసుకున్న స్వల్పకాలిక రుణాలు రూ.180.11 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.257.97 లక్షలు, ఇతర రుణ బకాయిలు రూ.309.29 లక్షలు వెరసి మొత్తం రూ.747.37 లక్షల రుణ వసూళ్లు సాధించామని చెప్పారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు పెడన బ్రాంచిలో జరిగిన కార్యక్రమంలో ఏజీఎం జి.సూర్యప్రకాశరావు, బ్రాంచి మేనేజర్ వి.సాయిబాబులు సొసైటీ చైర్మన్ పకీరు, సీఈఓ పెన్నేరు రామకృష్ణలకు రుణ వసూళ్లలో ఉత్తమ ప్రతిభ సాధించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సొసైటీ నూరు శాతం రుణ వసూళ్లు సాధించడంలో సహకరించిన రైతులకు పకీరు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించాలని వినతి

పెడన: స్కూల్ అసిస్టెంట్ల నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లుగా 247 మంది ఉన్నతి పొందారని, ఈ 247 ఖాళీలను సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉన్నతి కల్పించి భర్తీ చేయాలని పీఆర్టీయూ (102) కృష్ణా జిల్లా అధ్యక్షుడు పెద్దిబోయిన శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. బాబ్జీ విజ్ఞప్తి చేశారు. శనివారం వారు డీఈఓ తాహేరా సుల్తానాను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో పీజీటీకి వెళ్లిన స్కూల్ అసిస్టెంట్ల స్థానంలో ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇవ్వకుండానే బదిలీలు నిర్వహించారన్నారు. దీనివల్ల అనేకమంది ఎస్జీటీలు మారుమూల ప్రాంతాలకు బదిలీలపై వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు.

పీజీటీలుగా పదోన్నతి పొందిన సుమారు 247 మంది స్కూల్ అసిస్టెంట్ల స్థానాలను సెకండరీ గ్రేడ్ టీచర్ల ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు.

నేడు విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక షార్కీ బాలికల వసతిగృహంలోని విద్యార్థినులకు నోట్ పుస్తకాలు, ఆర్థికసాయం అందజేస్తామని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. వేణుకుమార్, బి. రాధాకృష్ణ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏడాదిగా మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

హోమియో మందులు అందజేత

మచిలీపట్నంటౌన్: వైజ్‌మెన్ క్లబ్, అజ్మీర్ బాబా సేవా సమాజం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వడదెబ్బ నివారణ హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సర్కారుతోటలోని వాసవీ వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు నేతి ప్రభాకర్, దివ్యరాశి, క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌పీర్, రాము, ఇస్మాయిల్, సయ్యద్ బాజీ, రాజ్‌కమల్, షేరాలీ, నాగేశ్వరరావు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంరక్షణ, పాల ఉత్పత్తిపై అవగాహన

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పశు సంరక్షణ, అధిక పాల ఉత్పత్తిపై పెదకళ్లేపల్లి, మెరకనపల్లి పాల ఉత్పత్తిదారులు, రైతుల సమావేశం పెదకళ్లేపల్లిలో శనివారం నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి తీసుకున్న చర్యలను వివరించారు. అధిక పాల ఉత్పత్తి సాధించేందుకు తీసుకోవాల్సిన మెలకువలు, పశువుల ఆరోగ్య సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకట రమణ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: గోసాల గ్రామంలో తారు రోడ్డు నిర్మాణానికి శనివారం రూ. 14 లక్షలతో శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పుట్ట కట్ట నుంచి సంతపాకల వరకు రోడ్డు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని కోరారన్నారు. ఎమ్మెల్యే చొరవతో మండల పరిషత్ నిధులు రూ. 10 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ. 4 లక్షలు మంజూరు చేశామన్నారు. మొత్తం రూ. 14 లక్షలతో దాదాపు 800 మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం చేపట్టామని సర్పంచి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రవీణ్‌కుమార్, పీర్‌అహ్మద్, శ్రీను, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలవరపు రవి తదితరులు పాల్గొన్నారు.